
సాక్షి
బాపట్ల
మంగళవారం । 11 । మార్చి । 2025

రోడ్ల నాణ్యత పరిశీలన



తెనాలి అర్బన్: పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు రోడ్లను క్వాలిటీ కంట్రోల్ బృందం సోమవారం పరిశీలించింది. వాటి నాణ్యత ప్రమాణాలను చెక్ చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామ శివారు రేగులగడ్డలో వందేళ్లనాటి సీతారామ చంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6.22	5.02
గుంటూరు	6.22	5.02
నరసరావుపేట	6.24	5.04

న్యూస్‌రీల్

ఎలక్ట్రిక్ బస్సులు వితరణ



మంగళగిరి: మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండతోపాటు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు రెండు ఎలక్ట్రిక్ బస్సులను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సోమవారం అందజేసింది. బస్సులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఈ బస్సుల్లో ఒకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎస్ఆర్ఐ జంక్షన్, డీజీపీ ఆఫీసు మీదుగా ఎయిమ్స్‌కు వెళ్తుంది. మరొకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎస్ఆర్ఐ జంక్షన్ మీదుగా శ్రీ పానకాలస్వామి కొండకు వెళ్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో సోమవారం తొలి మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది. పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం–2బీ పరీక్షకు గుంటూరు జిల్లాలోని 87 పరీక్షా కేంద్రాల పరిధిలో 28,274 మంది విద్యార్థులు హాజరయ్యారు. 446 మంది గైర్హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు ప్రయత్నించిన ఓ విద్యార్థిపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. ఆర్ఐవో జీకే జుబేర్ ఐదు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంగళగిరి: సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం మంగళగిరి మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, అధికారులతో కలిసి ఆమె వర్సిటీని సందర్శించారు. సీఎం ప్రారంభించనున్న సీవీ రామన్ బ్లాక్, ప్రసంగించనున్న అబ్దుల్ కలామ్ ఆడిటోరియం తదితర ప్రదేశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు, ప్లానింగ్ ఈడీ వీఆర్ అలపర్తి, సెక్రటరీ అనంత్ సింగ్, రిజిస్ట్రార్ ఆర్. ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్ సింగ్, జీఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష రద్దు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 7న జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పర్స్పెక్టివ్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పరీక్షను వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు రద్దు చేశామని సీఈ ఏ శివప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 12వ తేదీన తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు.

యార్డుకు 1,61,169 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,61,169 బస్తాల మిర్చి రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,30,718 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది.

అభివృద్ధికి పన్ను పోటు!

- ఇంటి పన్నుల వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం
- చీరాల డివిజన్‌లో పేలవంగా వసూళ్లు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, ఉద్యోగులు
- అభివృద్ధి పనులకు తీవ్ర విఘాతం



చీరాల మండల పరిషత్ కార్యాలయం



చీరాల టౌన్: పంచాయతీలు అభివృద్ధి చెందాలన్నా.. కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలన్నా ఇంటిపన్నులే కీలకం. సకాలంలో పన్నులు వసూలు చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. మార్చి నెలాఖరులోగా పన్నులు వసూలు చేయాలి.. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా, మండల స్థాయి అధికారుల తరచూ ఆదేశాలు జారీ చేస్తుంటారు. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. గ్రామ పంచాయతీ ఉద్యోగుల నిర్లక్ష్యం, మండల అధికారులు, డివిజనల్ అధికారుల ఉదాసీనతతో చీరాల డివిజన్‌లో ఇంటి పన్నుల వసూళ్లు పేలవంగా జరుగుతున్నాయి.

33.16 శాతం మాత్రమే వసూలు

బాపట్ల జిల్లా పరిధిలోనే చీరాల డివిజన్ ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉంది. ఇంకా డివిజన్‌లో రూ.11.16 కోట్ల ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉంది. చీరాల డివిజన్‌లో మార్చి 5 నాటికి కేవలం 33.16 శాతం మాత్రమే పన్ను వసూలు జరిగింది. చీరాల డివిజన్‌లో ఉన్న అన్నీ గ్రామ పంచాయతీలకు పంచాయతీ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ బకాయిల వసూళ్లలో మాత్రం వెనుకబడ్డారు. పది మండలాలకు చెందిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయకపోవడంతో గడువు ముగుస్తున్నా పన్నులు వసూళ్లు చేయలేని పరిస్థితి నెలకొంది.

ప్రతీ గ్రామ పంచాయతీలో సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది ఉన్నారు. కానీ పన్నుల వసూళ్లు మాత్రం ఇంకా 40 శాతం కూడా చేరుకోలేదంటే అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల నేతృత్వంలో బిల్ కలెక్టర్లుతో పాటు సచివాలయాల ఉద్యోగులు ఏవిధంగా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. చీరాల డివిజన్ పరిధిలో ఉన్న చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో ఉన్న 10 మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు మొక్కుబడిగానే చేస్తున్నారు. ఈ నెల 31లోపు 100 శాతం ఇంటిపన్నులు, పాత బకాయిలు వసూళ్లు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇంటి పన్నుల వసూళ్లు సక్రమంగా జరగడం లేదు. చీరాల డివిజన్ పరిధిలో బల్లికురవ, సంతమాగులూరు, చినగంజాం, అద్దంకి, కొరిశపాడు, చీరాల, ఇంకొల్లు, జె.పంగులూరు, వేటపాలెం, కారంచేడు మండలాలు ఉన్నాయి. డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 199 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ 10 మండలాలకు సంబంధించి 2024–25 సంవత్సరాలకు రూ.15.31 కోట్లు ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా.. దీనిలో డివిజన్‌లో రూ.4.15 కోట్లు మాత్రమే పన్నులు వసూలు చేశారు.

40 శాతం కూడా దాటని వైనం..

వసూళ్లకు ప్రత్యేక చర్యలు..

గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ విధిగా ఇంటిపన్ను చెల్లించాలి. పంచాయతీల అభివృద్ధికి పన్ను బకాయిలు విఘాతం కాకూడదు. ప్రతి ఒక్కరూ మార్చి 31లోపు పన్నులు చెల్లించాలి. పాత బకాయిలు, ప్రస్తుత పన్నులు అందరూ చెల్లించాలి. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నెలాఖరు కల్లా డివిజన్‌లోని 10 మండలాల్లో నూరుశాతం పన్నులు వసూళ్లు చేయాలి.

– బి.శివన్నారాయణ, డివిజినల్ పంచాయతీ అధికారి, చీరాల

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువు లోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో నీటిపన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. జిల్లాలో పీ–4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీ–4 సర్వే వాల్ పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల ద్వారా సైనిక వెల్ఫేర్ ఫండ్ కోసం సేకరించిన రూ.10.30 లక్షల చెక్కును డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎం, ఏసీలు జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. డీఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, సర్వ శిక్ష అభియాన్ పీఓ నాగిరెడ్డి, డీపీఓ ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి, డీఏఓ రామకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి
- ఆగివున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టగా ఘటన
- ఘటనాస్థలంలోనే మృతి చెందిన వైనం



చిన్నారి రూప మృతదేహం

వెల్దుర్తి: ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొని తండ్రి కూతురు మృతిచెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన పల్లా శ్రీనివాసరావు (30), తన కుమార్తె రూప (3)తో కలిసి ద్విచక్రవాహనంపై మాచర్ల నుంచి స్వగ్రామం మిట్టమీదపల్లెకు వెళ్తున్నారు. ఈక్రమంలో వేగంగా వెళ్తూ 565 జాతీయ రహదారిలో వెల్దుర్తి సమీపంలోని పెట్రోలు బంకు వద్ద రోడ్డు మార్జిన్‌లో నిలుపుదల చేసిన ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పల్లా శ్రీనివాసరావు, రూపలు తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలంలోనే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పల్లా శ్రీనివాసరావు మృతదేహం

సింహ వాహనంపై
బ్రహ్మాండ నాయకుడు

గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన నారసింహుడు



చిన్న శేషవాహనంపై కొలువుదీరిన స్వామి



సింహ వాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు

మంగళగిరి / మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గ్రామోత్సవంలో స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మాండ నాయకుడు నృసింహస్వామిని భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. హింసించే స్వభావం గల వారిని హింసించేవాడు నారసింహుడు, నరుల్లో సింహం వంటి వాడు నరసింహ స్వరూపుడైన స్వామి వారి సింహ వాహనోత్సవం తిలకించిన వారికి దుర్మార్గుల వల్ల కలిగే భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. ఉత్సవం సందర్భంగా రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు మనుమలు వ్యవహరించారు.

ఉదయం చిన్న శేషవాహనంపై...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చిన్నశేష వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కైంకర్యపరులుగా దేవతి భగవన్నారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

నేడు హంస, గజ వాహన సేవలు

మంగళవారం ఉదయం హంస వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి గజ వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.



దర్శించుకుంటున్న భక్తులు

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- ఒక్క సంక్షేమ కార్యక్రమాన్నీ పరిపూర్ణంగా అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం
- సమయం వచ్చినప్పుడు ఓట్లతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ప్రజలు
- యువత పోరు సన్నాహక సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి
- రేపటి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం, యువత పోరు జయప్రదానికి విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

నెహ్రూనగర్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన జరగనున్న యువత పోరుకు సంబంధించి సోమవారం సన్నాహక సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి పాలనలో రాష్ట్రం తిరోగమనంలో ఉందన్నారు. గుంతలు పూడ్చి రోడ్లు వేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. 9 నెలల కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పరిపూర్ణంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఇస్తున్న వృద్ధాప్య పింఛన్‌లలో భారీగా కోతలు పెడుతున్నారని విమర్శించారు. 9 నెలల కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిందని, సమయం వచ్చినప్పుడు ఓట్లతో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.

కూటమి ఎమ్మెల్యేల అక్రమాలు అనంతం

కూటమి పాలనలో ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, బియ్యం అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ పని చేయాలన్నా కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. రోజు రోజుకు కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిపోతోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 12న జరిగే వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో, యువత పోరు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాలుపంచుకుని దిగ్విజయం చేయాలన్నారు. తద్వారా ఈ ప్రభుత్వం సక్రమంగా పనిచేయడం లేదనే సందేశాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. పార్టీ శ్రేణులే పేదవారి గొంతుగా మాట్లాడాలని సూచించారు. పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ స్థానాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆనాడు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక ఎత్తు అయితే.. తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. మోసం చేయడంలో నంబర్ వన్ అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు పేరే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. సమాజంలో విద్య, ఆరోగ్యం రెండు కళ్లు వంటివన్నారు. నేడు విద్యకు సంబంధించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో విద్యార్థులు కాలేజీల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఏపీలో 28 మెడికల్ కాలేజీలు ప్రారంభమైతే.. ఇంటికే వచ్చి వైద్యం చేసే పరిస్థితి ఉందన్నారు. ఆ మెడికల్ కాలేజీలను నేడు ప్రైవేటీకరణ చేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. వీటన్నింటిపై పోరాటం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు నగర అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణలు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేవరకు పోరాడుతాం

- సమస్య సీఎం దృష్టికి వెళ్లినా పరిష్కారం కాకపోవటంపై అసంతృప్తి
- భవిష్యత్ కార్యాచరణపై పుల్లారావు బాధితుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సాయి సాధన బాధితుల సంఘం ప్రతినిధి సాంబశివరావు

నరసరావుపేట టౌన్: కలిసి కట్టుగా ఉద్యమం చేసి న్యాయం జరిగే వరకు పోరాడదామని సాయి సాధన చిట్‌ఫండ్ స్కాం బాధితులు తీర్మానించుకున్నారు. సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు సోమవారం పట్టణంలోని ఓ హోటల్‌లో సమావేశం అయ్యారు. పాలడుగు పుల్లారావు చిట్‌ఫండ్, విజయలక్ష్మి టౌన్‌షిప్ పేర్లతో కోట్లాది రూపాయలు వసూలు చేసి పరారీ అయిన విషయం విధితమే. రియల్ ఎస్టేట్ మోసంపై పుల్లారావుతో పాటు అతని భాగస్వాములపై గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అవ్వగా, కోర్టులో లొంగిపోయి సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఆ కేసులో సోమవారం పుల్లారావు అతని భాగస్వాములు గుండా సాంబశివరావు, గుండా అనిల్‌లకు గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసిన చీటింగ్ కేసులో పుల్లారావుకు బెయిల్ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై బాధితులంతా సమావేశమై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకువెళ్లినా న్యాయం జరగలేదని కొందరు అభిప్రాయబడ్డారు. కేసు సీఐడీకి బదిలీ అయినప్పటి నుంచి పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేసే వరకు అవసరమైతే రిలే నిరాహార దీక్షలు చేద్దామని చర్చించుకున్నారు. చీటీపాట స్కాంలో ఉన్న బాధితులు సుమారు 600 మందితో త్వరలోనే సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని కమిటీ సభ్యులు చేకూరి సాంబశివరావు, ఇ.ఎం.స్వామి, యామిని రామారావు తెలిపారు.

క్లుప్తంగా

కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యం నిర్వీర్యం


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్ జైసన్‌బాబు, పార్టీ నాయకులు

చీరాల రూరల్: సూపర్స్ సిక్స్ పథకాలను అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చదువును, పేదలకు వైద్యాన్ని అందించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరి బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసులు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు ఆదేశాలతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రజలకు అనేక హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు ఒక్కటీ కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌లను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లిష్ మీడియంతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్, ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్ అందిస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటన్నింటిని దూరం చేసిందని మండిపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా గత ప్రభుత్వం అడుగులు వేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించిందని వివరించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి వారికి చదువుకు దగ్గర చేసిందని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న మెడికల్ కాలేజీలు తీసుకువస్తే వాటని కట్టకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం ఏపీకి మెడికల్ సీట్లు కేటాయిస్తే ప్రధానమంత్రి మోదీకి చంద్రబాబు సీట్లు వద్దని లేఖలు రాయడమేమిటని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చిందని, ప్రతినెలా వారికి మూడు వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామనే హామీలు తుంగలో తొక్కిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 12న బాపట్ల జిల్లాలో జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు గవిని శ్రీనివాసరావు, కావూరి రమణారెడ్డి, ఉమ్మిట్టి శివ, సంగుల జాన్ చిరంజీవి, దుడ్డు రాంబాబు, కోడూరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

- ఎస్పీ తుషార్ డూడీ
- స్పందనలో సమస్యలు ఏకరువు పెట్టిన బాధితులు

బాపట్ల టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 89 మంది బాధితులు హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకు విన్నవించుకున్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ తుషార్‌డూడీ, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్ఐలతో మాట్లాడారు. తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఉద్యోగం పేరుతో రూ. 2.75 లక్షలు స్వాహా



బాపట్ల పట్టణానికి చెందిన నేను బిటెక్ పూర్తిచేసి ఉద్యోగం వెతుకుంటున్న సమయంలో చీరాల ప్రాంతానికి చెందిన కట్టా జయరాజుతో పరిచయం ఏర్పడింది. అతను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్ ఉద్యోగం చేస్తున్నాడు. నాకు ఎయిర్‌ఫోర్స్‌లోని ఎంటీఎస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని విడతల వారీగా రూ. 23.75 లక్షలు తీసుకున్నాడు, ప్రస్తుతం ఆయన రాజస్థాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. నగదు తీసుకొని ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ఉద్యోగం ఇప్పించలేదు. ఇదేమని అడిగితే నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నారు.

– దేవరకొండ అవినాష్, బాపట్ల

పోలీసుల చెరలు భరించలేకపోతున్నా..



పర్చూరు మండలం, గొల్లపూడి గ్రామానికి చెందిన నాకు మా గ్రామంలో 4 ఎకరాల పొలం ఉంది. దానివక్కనే చెరుకూరు గ్రామానికి చెందిన యర్రాకుల నాగేశ్వరరావు పొలం ఉంది. నన్ను నా పొలంలోకి వెళ్లనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తుంటే ఏడాదిన్నర క్రితం పర్చూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాను. ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది. నాగేశ్వరరావు కొడుకు కానిస్టేబుల్ కావడంతో పర్చూరు ఎస్ఐ, కానిస్టేబుల్స్ నిత్యం నన్ను రాజీపడమని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. రాజీపడలేదని నన్ను పొలంలోకి కూడా వెళ్ళనీయకుండా ఇబ్బంది పెడుతున్నారు. పోలీసులు పెట్టే చెరలు భరించలేకపోతున్నా.

– బొద్దు నాగేశ్వరరావు, పర్చూరు

ప్రాణ భయంతో ఊరు వదిలి వెళ్లిపోయాం



బాపట్ల మండలం, దరివాదకొత్తపాలెం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన నేను గిరిజన కులానికి చెందిన మహిళను. నన్ను 2009లో అదే ప్రాంతానికి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన శవనం గోవర్ధన్‌రెడ్డి ప్రేమించి వివాహం చేసుకున్నారు. మా దాంపత్యంలో ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. గడిచిన ఐదు నెలలుగా అత్త నాగరత్తమ్మ, మామ వెంకటేశ్వరరెడ్డి, ఆడపడుచు తిరుపతమ్మ, ఆమె భర్త రవితో పాటు నా భర్త గోవర్ధన్‌రెడ్డి కూడా నన్ను చిత్రహింసలకు గురి చేస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. రెండు సార్లు హత్యాప్రయత్నం కూడా చేశారు. ప్రాణ భయంతో నేను రెండు నెలలుగా ఇద్దరు కుమార్తెలతో నరసరావుపేటలోని బంధువుల ఇంటివద్ద తలదాచుకుంటున్నాను. వారి చెరనుంచి నన్ను, నా బిడ్డల్ని కాపాడండి.

– శవనం ఝాన్సీ, వైఎస్సార్ నగర్

దొంగతనం జరిగి ఆరు నెలలైనా పురోగతి శూన్యం



పట్టణంలోని విజయలక్ష్మిపురానికి చెందిన నేను 80 ఏళ్ల వృద్ధురాలిని. గతేడాది అక్టోబర్ 16న నా ఇంట్లో దొంగలు పడి ఐదు సవర్ల బంగారం దోచుకెళ్లారు. నా ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగల గురించి సమాచారం అందించినా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికి ఎస్పీ గారికి రెండు సార్లు అర్జీలు ఇచ్చాను. ఎనిమిది పదుల వయస్సులో స్టేషన్ల చుట్టూ నేను తిరగలేకపోతున్నాను. నాకు త్వరితగతిన న్యాయం చేయాలి.

– సుద్దపల్లి హేమలత, బాపట్ల

నన్ను, నా భర్తను చంపాలని చూస్తున్నారు

చీరాల మండలం, ఈపూరుపాలెం గ్రామానికి చెందిన నన్ను, నా భర్తను అత్త కోటేశ్వరి, మామ శ్రీనివాసులు, మరిది మణికంఠ కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నన్ను నా మరిది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయాన్ని భర్తకు చెప్పానని మనస్సులో పెట్టుకొని అత్తమామల అండతో నన్ను, నాభర్తపై నిత్యం దాడులు చేస్తున్నారు. వీళకల బాధలు భరించలేక ఇద్దరం జాండ్రపేటలో అద్దెకు ఉంటున్నాం. ఇటీవల అక్కడికి వచ్చికూడా మాపై దాడి చేశారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయంగా ఉంది.

– ఎ. దివ్య, ఈపూరుపాలెం

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు గాయత్రి ఎంపిక



వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు విద్యార్థిని గాయత్రి జిల్లా కబడ్డీ సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫణి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆదివారం ఒంగోలు మినీ స్టేడియంలో ప్రకాశం ఉమ్మడి జిల్లా కబడ్డీ సబ్ జూనియర్స్ బాలబాలికల ఎంపిక నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో హైస్కూలు ఎనిమిదో తరగతి విద్యార్థిని గాయత్రి ఎంపికైనట్లు చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగే సబ్ జూనియర్స్ టోర్నమెంట్‌లో ఆమె పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని పీడీ ఎం. కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయురాలు జె. శ్రీవాణి అభినందించారు.

చేతివృత్తులకు నైపుణ్య శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: చేతి వృత్తులకు సంబంధించి అత్యాధునిక నైపుణ్య శిక్షణను పొందటం ద్వారా ఉద్యోగ, ఉపాధి పనులలో గొప్ప స్థాయికి వెళ్లగలరని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ చేతివృత్తుల వారికి అత్యుత్తమ శిక్షణను అందిస్తున్నట్టు వివరించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ చేతివృత్తి కోర్సు పథకం ద్వారా సింక్రో సర్వ్ గ్లోబల్ సెల్యూషన్స్ ద్వారా శిక్షణ పొందిన వారికి సోమవారం సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న తమ్మాజీరావు మాట్లాడుతూ, పదవ తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఐటీ, పైథాన్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, బేసిక్ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఉద్యోగ, ఉపాధి కల్పనలో సహరిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు 6301851503, 6301851504 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఊరుకోం !

- గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచుతున్న కూటమి
- పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి స్పష్టం చేశారు. ఇంకొల్లు మండలం పావులూరులోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు తాను నియోజకవర్గ సమన్వయకర్తగా వచ్చానని తెలిపారు. ముందుగా పార్టీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. తర్వాత నియోజకవర్గంలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తాము అభివృద్ధికి అవరోధం కాదని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే వారికి పార్టీలకతీతంగా పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి

వైఎస్సార్ సీపీ హయాంలో ఆర్థిక సమస్య ఉన్నప్పటికీ ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహనరెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని మధుసూదనరెడ్డి తెలిపారు. అయితే, అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. మేని ఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజలను ఎంతకాలం మభ్య పెడతారని ప్రశ్నించా రు. నియోజక అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేతో తా ము సహకారం అందిస్తామని, సీనియర్ నాయకుడుగా ఆయన నియోజకవర్గానికి కావాల్సిన అభివృద్ధి పనులుపై దృష్టి పెడితే బాగుంటుందని సూచించారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలను పెంచుకుంటూ పోతూ సామాన్య వ్యక్తులను అందుకు బలి చేయడం సమంజసం కాదని హితవు పలికారు.

ఎమ్మెల్యే తీరు బాగోలేదు !

గత 40 ఏళ్లుగా పావులూరులో రేషన్ షాపు నడుపుతున్న డీలర్లను తొలగించడం సమంజసం కాదని తెలిపారు. గ్రామాల్లో సన్న, చిన్న కారు రైతులు, రోజూవారీ కూలీల మధ్య గొడవలు పెట్టి కక్షలు, కార్పణ్యాలు పెంచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తమ నాయకుడు వైఎస్. జగన్‌మోహనరెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ వైపు అధికారులు మొగ్గు చూపవచ్చు గానీ, పక్షపాత ధోరణిగా వ్యవహరించడం సరైనది కాదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు కఠారి అప్పారావు, మున్నం నాగేశ్వరరెడ్డి, జంపని వీరయ్య చౌదరి, చిన్ని పూర్ణారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు పులఖండం రామకృష్ణారెడ్డి, గాదె సుబ్బారెడ్డి, గేరా స్వరాజ్ కుమార్, కరుణాకర్, రాందాస్ రెడ్డి, బిల్లాలి డేవిడ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర జీవనం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ వెల్లడి


బల్లికురవలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలతో ప్రజలు ఆరోగ్యంగా జీవించడంతో పాటు భూమి సారవంతంగా ఉంటుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి. వాణిశ్రీ తెలిపారు. సోమవారం ఆమె బల్లికురవ, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామ సంఘ సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించాని తెలిపారు. గ్రామాల వారీగా ప్రకృతి వ్యవసాయ సాగును పెంచాలని చెప్పారు. పురుగుమందులు అవశేషాలు లేని ఆహార పదార్థాలు పండిస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటంతో భూములు నిస్సారం కావడంతో పాటు పెట్టుబడులూ పెరుగుతాయని చెప్పారు. గ్రామాల వారీగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, పర్యవేక్షించేందుకు యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ఐసీఆర్‌పీలను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో జైన్ క్రాప్ ప్రతినిధి ప్రతిమ, రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రతినిధి సౌమ్య, అడిషన్ డీపీఎం మోహన్, ఎన్ఎంఏలు చందన, దుర్గ, మాస్టర్ ట్రైనర్ అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జులు కల్పన, నాగాంజలి, నాగరాజు పాల్గొన్నారు.

పిందె రాలడానికి పోషకాల లోపమే కారణం


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత

వేటపాలెం: మామిడి చెట్లలో పోషకాల లోపాలతో పిందెలు రాలుతాయని గుంటూరు జిల్లా లాం ఫారం కీటక నివారణ శాస్త్రవేత్త నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రామన్నపేట, పందిళ్లపల్లిలో మామిడి తోటలను సోమవారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పిందె రాలకుండా పోషక లోపాలను నివారించుకోవాలని సూచించారు. రైతులు దిగుబడులు పెంచుకోవడానికి ఫ్రూట్ కవర్లు వాడాలని తెలిపారు. కాయ నిమ్మకాయ సైజులో ఉండగానే కవర్లు కట్టుకోవాలని చెప్పారు. మామిడి తోటల్లో తేనె మంచు పురుగులు నివారణకు సూచనలు ఇచ్చారు. పూతని ఆశించే గొంగళి పురుగులు, ఆకు తినే పురుగులు, గూడు కట్టుకొనే పురుగులు ఎక్కువైనప్పుడు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి


బాలసుందరం మృతదేహం

అద్దంకి: బైకును లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ చర్చి పాస్టర్ మృతి చెందారు. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని బస్టాండు సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన అత్తోటి బాలసుందరం (66) బైకుపై పని మీద అద్దంకి వచ్చారు. ఈ క్రమంలో అద్దంకి నుంచి మేదరమెట్ల వైపునకు గూడ్స్‌తో లారీ వెళ్తోంది. బైకు పట్టణంలోని బస్టాండు సమీపంలోకి రాగానే లారీ ఢీకొట్టడంతో బాలసుందరం అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవితేజ వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

వరలక్ష్మి చిరంజీవి


వరలక్ష్మి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీఓ పి.గ్లోరియా

బాపట్ల: అవయవ దానం ద్వారా కొపనాతి వరలక్ష్మి(60) చిరంజీవిగా నిలిచారని ఆర్డీఓ పి.గ్లోరియా కొనియాడారు. ఆమె మరణించినా, చిరకాలం మన మధ్యనే జీవిస్తూ ఉంటారని తెలిపారు. ఆమె ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు దానం చేయడం ద్వారా మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. వరలక్ష్మి భౌతికకాయాన్ని సోమవారం ఉదయం వివేకానంద కాలనీలో సందర్శించి నివాళులర్పించారు. అవయవ దానానికి అంగీకరించిన వరలక్ష్మి భర్త వీరకుమార్‌కు శాలువా కప్పి అభినందించారు. మామయ్య నరసింహారావు ఉదాత్తమమైన నిర్ణయం తీసుకుని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, తహసీల్దార్ షేక్ సలీమా, బాపట్ల జిల్లా శరీర, అవయవ దాతల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, సభ్యులు యాజలి భాస్కరరావు, యూటీఎఫ్ నాయకులు జడ వినయ్‌కుమార్. ఎం.ఎస్.ఎస్. భారతి, ఉదయకుమారి, నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

క్రోసూరు: పీసపాడు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్న గుజ్జర్లపూడి రామారావు(45) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్రోసూరు మండల విద్యుత్ శాఖ ఏఈ బసవరాజు కథనం ప్రకారం. పారుపల్లిలోని ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో పీసపాడు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే లైన్ సప్లయిని ఆఫ్ చేసుకుని రామారావు పనిచేస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తు క్రోసూరు నుంచి వచ్చే లైన్ ద్వారా విద్యుత్ ప్రసరించటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడి నుంచి కింద పడిపోయాడు. అతనిని హుటాహుటిన సత్తెనపల్లి ప్రైవేటు ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఏఈ ఫిర్యాదు చేశారు. రామారావు సత్తెనపల్లిలో నివాసముంటూ పీసపాడులో విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగేళ్ల నుంచి లైన్‌మేన్‌గా పనిచేస్తున్న రామారావు మరణం ప్రజలను కలచివేసింది.

తిరునాళ్లకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


ఘటన స్థలంలో మృతుడు నాగేశ్వరరావు, బాధితుడు ఆంజనేయులు

రెంటచింతల: పాలువాయి గేటు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోలి గ్రామానికి చెందిన మాచవరపు నాగేశ్వరరావు(45) బాలగాని ఆంజనేయులు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై దుర్గి మండలంలోని ముటుకూరు తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి 167 ఏడీ నిర్మాణంలో భాగంగా పాలువాయి గేటు గ్రామంలోని రైల్వే ట్రాక్ వద్ద చేపట్టిన హైలేవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవంతో రాత్రి సమయం కావడం వల్ల ముందు ఏమి కనిపించకపోవడంతో ఒక్కసారిగా ద్విచక్రవాహనంతో బ్రిడ్జిపై నుంచి ఇద్దరు కింద పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ తొలుత నర్సరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో మాచవరపు నాగేశ్వరరావును ఆస్పత్రికి తరలించినా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలగాని ఆంజనేయులును మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నట్లు ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నాగేశ్వరరావుకు భార్య ఏసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఏసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

జాతీయ వాలీబాల్ పోటీల్లో విజేత సెయింట్ ఆన్స్


విజేత జట్టుతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: జాతీయ వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఈ మేరకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు సోమవారం తెలిపారు. గుంటూరు ఎస్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్-2025 నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన వాలీబాల్ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 26 జట్లు పోటీపడ్డాయని తెలిపారు. ఫైనల్స్‌లో సెయింట్ ఆన్స్ కాలేజీ జట్టు, బాపట్ల కాలేజీ జట్టును ఓడించి విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. విజేతకు రూ.10 వేలు నగదు బహుమతి అందించారని ప్రిన్సిపాల్ కె. జగదీష్‌బాబు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విజేతలను అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

కళా సాధనకు నిరంతరం కృషి చేయాలి

- ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు
- జాతీయ స్థాయి సినిమా పాటల పోటీల విజేత విజయవాడ మాధవి


విజేతలతో రాసంశెట్టి నరసింహరావు

సత్తెనపల్లి: ప్రతి మనిషిలో ఓ కళ ఉంటుందని, దాన్ని సాధించడానికి నిరంతర కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు అన్నారు. చైతన్య కళా స్రవంతి సత్తెనపల్లి 46వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ తెలుగు సినిమా పాటల పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలలో ప్రథమ బహుమతి మాధవి (విజయవాడ), ద్వితీయ బహుమతి కె.రామారావు (కారంపూడి), తృతీయ బహుమతి కె.దుర్గాప్రసాద్ (హైదరాబాద్) వారు కైవసం చేసుకున్నారు. వీరితోపాటు 10 మంది కన్సోలేషన్ బహుమతులు, 15 మంది ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. బహుమతి ప్రదానోత్సవానికి చైతన్య కళ స్రవంతి గౌరవ సలహాదారు లయన్ ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఏ.విశ్వేశ్వరరావు(పిడుగురాళ్ల), ఎస్.కళాంజలి(రాజంపేట), ఎం.రవివర్మ (నరసరావుపేట) వ్యవహరించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త పోతుగంటి రామ కోటేశ్వరరావు, శ్రీమారుతీ ట్రేడర్స్ అధినేత వెంకట హరేరామ చెంచయ్య పాల్గొన్నారు.